క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చర్యలు



అధికారులకు సమస్యను వివరిస్తున్న నాయకుడు ముత్యాల నాయుడు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం గ్రామంలోని ప్రధాన సమస్యలైన మురుగనీటి కాలువ అవుట్ లెట్ ఏర్పాటు, షీలానగర్ రైల్వే అండర్ బ్రిడ్జికు గ్రామ ప్రధాన రహదారిని కనెక్టివిటీ చేయాలని గ్రామ నాయకుడు కరణం ముత్యాల నాయుడు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన జీవీఎంసీ అధికారులు గ్రామంలో సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించారు. ముత్యాల నాయుడు వారికి సమస్యలను వివరించారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు సత్కారం



కిక్ బాక్సింగ్ విజేత అశోక్, భగవద్గీత శ్లోకాల పోటీలో బహుమతి దక్కించుకున్న అప్పారావును సత్కరిస్తున్న కార్పొరేటర్

అగనంపూడి: రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన కొమ్మోజు అశోక్, జిల్లాస్థాయి భగవద్గీత శ్లోకాల పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించిన ఆర్టీసీ ఉద్యోగి జాజుల అప్పారావులను బుధవారం ఘనంగా సత్కరించారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బి.సత్యనారాయణ, వి.వరహాలు, ఎల్వీ రమణ, టి.రాము, కె.భీష్మాచారి, డి.త్రిమూర్తులు, కె.అప్పారావు, ఎం.కోటేశ్వరరావు, బి.చందు, జి.పద్మ, ఎం.వి.రమణ,చిన్ని పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటా..



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును సన్మానిస్తున్న వెల్డింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్

అక్కిరెడ్డిపాలెం: వెల్డర్లు, షాపుల ఓనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆటోనగర్‌లోని వాసీవా భవనంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ వెల్డింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు అండగా ఉంటానన్నారు. ఈ సందర్భంగాఏపీ టెక్నికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం కోసం ఆందోళన

అక్కిరెడ్డిపాలెం: వాల్‌మార్ట్ ఎదురుగా గల ఎస్‌ఆర్‌ఎంటీ సెక్యూరిటీ గార్డు హఠాన్మరణంతో కుటుంబ సభ్యులు, సీఐటీయూ నాయకులు నష్టపరిహారం కోసం ఆందోళన చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. ఎస్‌ఆర్ ఎంటీ కంపెనీలో నాలుగు నెలల కిందట సెక్యూరిటీ గార్డు దాసరి కామేశ్వరరావు (42) విధుల్లో చేరాడు. బుధవారం సాయంత్రం హఠాన్మరణం చెందాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు, సీటు నాయకులతో కలిసి కామేశ్వరరావును సకాలంలో హాస్పటల్‌కు తరలించకపోవడం వల్లే మృతి చెందాడని అభియోగం మోపుతూ నష్టపరిహారం అందించాలని ఆందోళన చేపట్టారు. కాకినాడ జిల్లాకు చెందిన ఎలైట్ కంపెనీ అధికారులు ఎస్‌ఆర్‌ఎంటీకు చేరుకుని చర్చలు జరిపారు. మృతునికి పీఎఫ్ వర్తిస్తుందని, నెలనెలా రూ.8 వేల పెన్షన్ అందుతుందని తెలిపారు.

ఆర్‌వోబీపై.. నీలినీడలు

ఆశ.. నిరాశే..

అవును 15 గ్రామాల ప్రజల పరిస్థితి అలాగే ఉంది. రైల్వే గేటు వల్ల ఏళ్ల తరబడి పడుతున్న కష్టాలకు ఆర్‌వోబీ ద్వారా విముక్తి కలుగుతుందని సంతోష పడ్డ వారికి నిరాశే మిగులుతుంది. నిర్మాణ పనులు అడుగు ముందుకు.. మూడడుగుల వెనక్కి అన్న చందంగా మారాయి. నిర్మాణ వ్యయం పెరగడమే తప్పా పనుల్లో పురోగతి కనిపించడం లేదు. దీంతో కష్టాలు ఎప్పుడు తీరుతాయి దేవుడా అని 15 గ్రామాల ప్రజలు నిట్టూరుస్తున్నారు.



అసంపూర్తిగా నిలిచిపోయిన ఆర్‌వోబీ

- ముందుకు సాగని పనులు
- కొరవడిన సమన్వయం
- గేటు పడితే తిప్పలే..
- ఎన్నాళ్లీ కష్టాలంటూ ప్రయాణికుల ఆవేదన
- పూర్తయితే 15 గ్రామాల ప్రజలకు ఉపయోగం

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్, చుక్కవానిపాలెం నిర్వాసిత కాలనీ వడ్లపూడి క్యాబిన్ వద్ద నిర్మించ తలపెట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) పనులపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వడ్లపూడి రైల్వే క్యాబిన్ వద్ద గేటు పడితే ఇరువైపులా భారీ వాహనాలు, కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు గంటల కొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితి. దీంతో ఇక్కడ ఆర్‌వోబీ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అయితే పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఒక వైపు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని ఐలా ప్రతినిధులు ప్రకటించారు.

పెరిగిన అంచనా వ్యయం

తొలుత రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులకు రూ.17 కోట్లకు అంచనా వేశారు. కానీ నిర్మాణ సామగ్రి ధర పెరగడంతో రూ.23 కోట్లకు పెరిగినట్లు సమాచారం. సుమారు 7 సంవత్సరాల కిందట ఆర్‌వోబీ నిర్మాణానికి ప్రతిపాదనలు చేపట్టారు. దీనిలో భాగంగా ప్రస్తుతం వడ్లపూడి రైల్వే క్యాబిన్ వద్ద రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జి నిర్మించారు. అప్పటి నుంచి అది అలంకార ప్రాయంగానే మిగిలిపోయింది. ఎఫ్ – బ్లాక్ వైపు, ఇటు బి, డి – బ్లాక్‌ల వైపు నిర్మాణాలు చేపట్టి నిర్మించిన బ్రిడ్జికు అనుసంధానం చేయాల్సి ఉంది.



బి, డి బ్లాక్ వైపు నిలిచిపోయిన వాహనాలు

బ్రిడ్జి నిర్మిస్తే ప్రయోజనాలెన్నో..

ఆర్‌వోబీ పూర్తయితే ఐలాతో పాటు సుమారు 15 గ్రామాలకు ప్రయోజనకరంగా మారుతుంది. ఎఫ్, ఈ, ఎవరేట్‌పార్క్, గ్రీన్ సిటీ, కాపు జగ్గరాజుపేట, యాదవ జగ్గరాజు పేట, ఫకీర్‌తక్యా వంటి ఎన్నో ప్రాంతాలకు గాజువాక వైపు రావడానికి ఇదే ప్రధాన మార్గం. ఇటు గాజువాక నుంచి పలు ప్రాంతాల ప్రజలు స్టీల్‌ప్లాంట్, వడ్లపూడి, అగనంపూడి, దువ్వాడ ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ మార్గమే శరణ్యం. గేటుకు ఇరువైపులా ఉన్న పలు బ్లాకుల్లో ఉన్న పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలు రాకపోకలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

విరుద్ధంగా వాస్తవ పరిస్థితి

మరో వైపు నిర్మాణ పనులు జరగాలంటే ఆటోనగర్ అన్ని బ్లాకుల్లో అండర్ గ్రౌండ్ ఎలక్ట్రికల్ కేబుల్ నిర్మాణ పనులు పూర్తికావాల్సిందేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అండర్ గ్రౌండ్ ఎలక్ట్రికల్ కేబుల్ పనులు ముందుకు సాగాలంటే ప్రస్తుత ప్రభుత్వంలో అత్యంత కీలకమైన వ్యక్తి చొరవ చూపాలని చెబుతున్నారు. కేబుల పనులకు నిధులు ఎప్పుడు సమకూర్చుతారో.. పనులకు మోక్షం ఎప్పుడో అని పారిశ్రామిక వేత్తలు సైతం వాపోతున్నారు.



ఎఫ్ బ్లాక్ వైపు నిలిచిపోయిన వాహనాలు

ఆర్‌వోబీ నిర్మిస్తే ఎంతో సౌలభ్యం



రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు త్వరగా చేపట్టి పూర్తి చేయాలి. పనిమీద దువ్వాడ వైపు వెళ్దామంటే గేటు పడడంతో సమయానికి వెళ్ల లేక పనులు జరగని సంఘటనలు చాలా ఉన్నాయి. ఈ మార్గం వల్ల సమయం ఆదా, దూరం తగ్గుతుంది. గేటు పడిందంటే సుమారు అరగంట నుంచి గంట వరకు సమయం వృథా అవుతుంది. అధికారులు, పాలకులు స్పందించి ఇప్పటికైనా ఆర్‌వోబీని పూర్తి చేయాలి.

– కాకి అప్పలరెడ్డి, తుంగ్లాం

దగ్గర మార్గమని వస్తే తిప్పలు



నాతయ్యపాలెం నుంచి దువ్వాడ, కూర్మన్నపాలెంకు ఈ మార్గంలో తొందరగా వెళ్ల వచ్చు. ఆ ఆలోచనతో వస్తే రైల్వే గేటు పడిన సమయంలో నరకం చూస్తున్నాం. ఇరువైపులా భారీ వాహనాలు, ఇతర వాహనాలు నిలిచిపోతున్నాయి.ఫలితంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒక వేళ గేటు తెరిచినా ట్రాఫిక్‌లో తప్పించుకుని వెళ్లడానికి ఓపిక నశించిపోతుంది.

– శ్యాంబాబు, అక్కిరెడ్డిపాలెం

దివ్యాంగుల క్రికెట్ టోర్నీ విజేత తూర్పు గోదావరి



విజేత తూర్పు గోదావరి జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఐ దాలిబాబు, నర్సింగరావు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక జింక్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. తూర్పు గోదావరి జిల్లా జట్టు విజేతగా నిలవగా.. విశాఖ జట్టు ద్వితీయ స్థానంలో, విజయనగరం జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు న్యూపోర్టు సీఐ దాలిబాబు, గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. ఉరుకూటి చైతన్య ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 10 జట్లు పాల్గొన్నాయన్నారు. కార్యక్రమంలో వందేభారత్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్ బాబు, ఏఎన్‌ఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత ఏఎన్‌ఆర్, గూటూరు శంకరరావు, బాటా శ్రీను, విశాఖ థ్రిల్లర్స్ సినీ డైరెక్టర్ వెంకట్, రంజిత్, స్వరూప్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: పెదగంట్యాడ 11కేవీ ఫీడర్,ఏపీహెచ్‌బీ 11కేవీ ఫీడర్,వుడా 11కేవీ ఫీడర్, 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏపీహెచ్‌బీ ఫీడర్ పరిధిలో.. ధర్మాల వీధి, ఎస్సీ కాలనీ, అరుణ కాంప్లెక్స్ ఏరియా, నీలాపు వీధి,ఏపీహెచ్‌బీ కాలనీ, నోవాస్ పోర్టు రోడ్డు, వుడా ఫీడర్ పరిధిలోని టీఎన్నార్ రోడ్డు సిద్ధేశ్వరం, వెంపళ్ల నగర్, సమతానగర్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్డు, టీజీఆర్ నగర్, సిద్ధేశ్వరం.

పెదగంట్యాడ ఫీడర్ పరిధిలో.. గొడ్డువానిపాలెం, దుర్గవానిపాలెం, నెల్లిముక్కు, సీతానగరం, పెదగంట్యాడ మెయిన్ రోడ్, బర్మా కాలనీ, బాబు జగ్జీవన్‌రామ్ నగర్, రైతుబజార్ ప్రాంతం, నడుపూరు.

ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో.. పెదగంట్యాడ ఇండస్ట్రియల్ ఏరియా తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు



గీతా పారాయణం చేస్తున్న మహిళలు



ఉమారామలింగేశ్వర ఆలయంలో పూజలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ పంచాయతన దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని గీతా పారాయణం చేశారు. అనంతరం ఆలయంలో ఉన్న విగ్రహాలకు పంచామృతాభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మొగలపల్లి త్రిమూర్తులు, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, కొల్లా అప్పలరాజు, బొండాడ వెంకటేశ్వరరావు, చిట్టూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో..

అగనంపూడి: గీతా జయంతిని పురస్కరించుకొని జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి జాబిలీహిల్స్ కాలనీలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. రామాలయంలో ఉదయం నుంచి విష్ణుసహస్ర పారాయణం, గీతా పారాయణం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



పాల్గొన్న ముఖ్య కార్యకర్తలు

- ఆర్టీసీలో ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాలి
- ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

ఉక్కునగరం: ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేస్తే కార్మికులు, ఉద్యోగులు మరింత రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తారని.. తద్వారా ఓఆర్ పెరుగుతుందని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. కూర్మన్నపాలెంలోని స్టీల్‌సిటీ డిపోలో బుధవారం జరిగిన ఉమ్మడి విశాఖ డిపోలకు చెందిన ఈయూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఉద్యోగులంతా విధి నిర్వహణలో బాధ్యతగా పని చేయాలని.. తప్పు చేయకుండా ఏ అధికారి అయినా కేసులు పెడితే ఉద్యమాలు చేయడానికి వెనుకాడవద్దని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న సుమారు 3 వేల మంది పదోన్నతులకు చెందిన ఫైల్‌ను క్లియర్ చేయాలని కోరారు. ఉప ప్రధాన కార్యదర్శి పి. భానుమూర్తి మాట్లాడుతూ ఆర్టీసీలో సుమారు 10 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటిని భర్తీ చేస్తే పని భారం తగ్గడంతో పాటు మరిన్ని ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించవచ్చునన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్. రామారావు మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్ పెట్టిన నైట్ అవుట్ ట్రావెలింగ్, ఓటీ అలవెన్సులు అన్నీ చెల్లించాలన్నారు. జోనల్ అధ్యక్షులు కె.జె. శుభాకర్, కార్యదర్శి బి.కృష్ణమూర్తి, తొమ్మిది డిపోల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు బానిసైతే భవిష్యత్తు అంధకారం

అగనంపూడి: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలు కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు అన్నారు. 79వ వార్డు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాదకద్రవ్యాలు, సైబర్ క్రైం, ఫోక్సో చట్టం, ర్యాగింగ్‌ల వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయితో పట్టుబడిన ముద్దాయిలు, గంజాయి సేవించే వారిలో అత్యధికులు విద్యార్థులే ఉండడం బాధాకరమన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురాశతో ఈ దుశ్చర్యలకు పాల్పడుతూ నేరస్తులుగా జైళ్లలో మగ్గుతున్నారన్నారు. అలాగే సైబర్ క్రైం పట్ల అవగాహన ఉంటే మోసాలకు గురికాకుండా ఉంటారన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినా, బాలికలు, మహిళలను మానసికంగా వేధించినా ఫోక్సో చట్టం ప్రయోగించి జైల్లో వేయడం జరుగుతుందన్నారు. బాల బాలికలు వీటికి దూరంగా ఉంటూ బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణారావు, పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తర్వాత సంకల్పం ప్రతిజ్ఞ చేశారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ మల్లికార్జునరావు

వ్యక్తి ఆత్మహత్య



అప్పలరాజు మృతదేహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కణితి మార్గం నుంచి వడ్లపూడి రైల్వే క్వార్టర్స్‌కు వెళ్లే రహదారిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. గాజువాక కర్ణవానిపాలెం ప్రాంతానికి చెందిన గాజువాక అప్పలరాజు (52) క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తుంటాడు. బుధవారం ఆ మార్గంలో వస్తున్న ఓ ఆటో డ్రైవర్ బహిర్భూమికి వెళ్లగా ఓ వ్యక్తి చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో అతను భయపడి స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించగా కర్ణవానిపాలేనికి చెందిన అప్పలరాజుగా గుర్తించారు. అప్పలరాజు ఎటువంటి బాధ్యతలు లేకుండా తిరుగుతుంటాడని, మూడు రోజుల కిందట తల్లి చనిపోయినా వెళ్లలేదని పోలీసులకు మృతుడు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధ్వజస్తంభ నిర్మాణ పనులకు శ్రీకారం



ధ్వజస్తంభ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులోని సంకట మోచన గణపతి ఆలయంలో ధ్వజస్తంభ నిర్మాణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఉమామహేశ్వరరావు, విజయభాస్కరరావు దంపతుల చేతుల మీదుగా ఈ పనులను ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తామన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, సుధాకర్, హరనాథ్, అప్పలరాజు, వీవీఎస్ మూర్తి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో పర్యావరణ పరిరక్షణ



ప్లాస్టిక్ అనర్థాలపై ర్యాలీ నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింగరావు తదితరులు

పెదగంట్యాడ: నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని 74వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింగరావు కోరారు. వార్డు శానిటేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై వార్డు పరిధిలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగం విడనాడాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో గుడ్డ సంచులు ఉపయోగించాలని కోరారు. అనంతరం దుకాణాలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య సిబ్బంది, సచివాలయ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరీక్షించలేక..

- టిడ్కో ఇళ్లల్లో చేరిన లబ్ధిదారులు
- సదుపాయాలు లేకున్నా ఇక్కడే ఉంటామని స్పష్టం



సెప్టెంబర్ 23న జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

పెదగంట్యాడ: అద్దె ఇళ్లల్లోనే మగ్గిపోతున్నాం.. 2017లో అప్పటి ప్రభుత్వం టిడ్కో ఇళ్లు కట్టి ఇస్తుందని చెప్పడంతో సొంతింటి కల నెరవేరుతుందని డీడీలు చెల్లించాం. ప్రతి నెలా బ్యాంకులకు వాయిదాలు చెల్లిస్తున్నాం. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. మా కలను నిజం చేయలేదు. పైగా ఇక్కడ మాకు కేటాయించిన ఇళ్లను రాజకీయ నాయకులు అమ్మేసుకున్నారని.. లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకున్నారని తెలుస్తోంది. మాకు కేటాయించిన ఇళ్లు అప్పగించాలని ప్రజాప్రతినిధులతో పాటు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చాం. అయినా పట్టించుకోలేదు. అందుకే ఇళ్లలో మేమే దిగాం. కరెంటు లేకున్నా.. తాగునీరు ఇవ్వకున్నా.. కాలువలు నిర్మించకపోయినా ఇక్కడే ఉంటామని తేల్చిచెప్పారు టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు.

ఇదీ విషయం

జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని కేవీఎల్‌రావు నగర్‌కు ఆనుకొని బీసీ రోడ్డులో టిడ్కో ఇళ్లు నిర్మించారు. వాటిని అప్పట్లోనే లబ్ధిదారులకు కేటాయించారు. ఆపై డీడీలు కట్టించుకున్నారు. బ్యాంకులకు లింక్ చేసి రుణాలు కూడా మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా కనీస సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. లబ్ధిదారులకు అప్పగించలేదు.



ఇళ్లలో దిగేందుకు వచ్చిన లబ్ధిదారులు

అవే ఇళ్లు.. మారిన లబ్ధిదారులు

టిడ్కో ఇళ్ల కోసం అప్పట్లో దరఖాస్తు చేసుకొని డీడీలు చెల్లించిన లబ్ధిదారులు ఇప్పుడు మారిపోయారని తెలిపారు. అర్హత ఉన్న లబ్ధిదారులపై అనర్హత వేటు వేసి వేరే వాళ్లకు వాటిని కేటాయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని చెప్పారు. అసలు మా ఇళ్లు ఇక్కడ ఉన్నాయో లేవో తెలియకపోవడంతో పిల్లా పాపలతో ఈ రోజు గృహ ప్రవేశాలు చేస్తున్నామని వివరించారు. ఇక్కడ కేటాయించిన లబ్ధిదారుల గురించి విచారణ జరిపించాలని కోరారు. ఇళ్లను అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



టిడ్కో గృహ సముదాయం వద్ద లబ్ధిదారులు

చేసేది లేక.. పిల్లాపాపలతో..

సొంతింటి కలను నిజం చేస్తారని 2017 నుంచి ఎదురు చూస్తున్నాం. బ్యాంక్ రుణాలు కట్టాల్సి వస్తోందని ఇక చేసేది లేక.. ఎవరో వస్తారని ఏదో చేస్తారని కూడా ఆలోచించకుండా లబ్ధిదారుల్లో కొంతమంది బుధవారం వారికి కేటాయించిన ఇళ్లల్లో ఉండేందుకు పిల్లాపాపలతో వచ్చేశారు. ఇళ్లను శుభ్రం చేసుకుని అక్కడే ఉన్నారు.

తప్పని పరిస్థితుల్లో..



నాకు 2017లో దయాల్‌నగర్‌లో టిడ్కో ఇల్లు మంజూరైంది. దీంతో నా సొంతింటి కల సాకారమైందని సంబరపడ్డాను. ఇప్పుడు అద్దె కట్టే బాధ తప్పుతుందని భావించాను. భారమైనా బ్యాంక్ రుణం తీసుకున్నాను. అప్పట్లో అప్పు చేసి డీడీ తీసి జీవీఎంసీ అధికారులకు ఇచ్చాను. ఎనిమిదేళ్లుగా నా ఇంటి కోసం ఆశగా ఎదురు చూస్తున్నాను. తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడకు వచ్చేశాను.

– కలవరపు చంద్రకళ, మొల్లివానిపాలెం, పెదగంట్యాడ.

ఇక్కడే ఉంటాం



సొంతింటి కోసం 2017లో డీడీ తీశాను. నేను నా భర్త ఇద్దరు పిల్లలు అత్తగారితో కలసి అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. నాకు మంజూరు చేసిన ఇంటిని అప్పగించడం లేదు. ఎన్నాళ్లని ఎదురు చూస్తాం. ఒక పక్క అద్దె బాధలు.. మరో పక్క బ్యాంక్ రుణాల ఒత్తిడితో మానసిన వేదనకు గురవుతున్నాం. అందుకే పిల్లాపాపలతో మాకు కేటాయించిన ఇంట్లో దిగిపోయాం. అధికారులకు దయ ఉంటే సదుపాయాలు కల్పించాలి.

– గొర్లె విజయకుమారి, భానోజీతోట, గాజువాక